క్లుప్తంగా

వంగపల్లి పద్మకు తెలుగు వెలుగు సాహితీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పద్మ

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్ గిరిజన బాలిక వసతి గృహ సంక్షేమ అధికారిణి వంగపల్లి పద్మ.. మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు తెలుగు వెలుగు సాహితీ పురస్కారానికి ఎంపికైంది. శనివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయగాన సభ కళావేదికలో పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సాహితి వేదిక వ్యవస్థాపకుడు పోలోజు రాజ్‌కుమార్ చార్యుల చేతుల మీదగా పురస్కారాన్ని అందుకున్నారు. గత పది సంవత్సరాలుగా ఉద్యోగ, సామాజిక సేవా రంగంలో ఆమె చేస్తున్న కృషిని గుర్తించి తెలుగు సాహితి వేదిక సంస్థ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను తోటి ఉద్యోగులు, కోదాడకు చెందిన ప్రముఖులు అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మునగాల : రాష్ట్రంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు గత మూడు ఏళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారని మండల కేంద్రానికి చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ కోరారు. ఈవిషయమై శనివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈమెయిల్ ద్వారా లేఖ పంపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు టీసీ, మెమోలు తీసుకోవాలంటే రూ.18 వేల ఫీజు చెల్లించాలని యాజమాన్యం డిమాండ్ చేస్తుందని ఆరోపించారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని లేఖలో కోరినట్లు మంగయ్య గౌడ్ తెలిపారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

నేరేడుచర్ల : తమకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని నేరేడుచర్ల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. శనివారం నేరేడుచర్లలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 15 నెలలుగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్నామని, తమ జీతాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలు ఆడుకోకుండా బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని కోరారు. ఈవిషయంపై మండలి, అసెంబ్లీలో ప్రజా ప్రతినిధులు స్పందికపోవడం సరికాదన్నారు. సమావేశంలో సంఘం నేతలు మంగయ్య, కృష్ణయ్య, సైదిరెడ్డి, యల్లయ్య, మల్లమ్మ, వీరారెడ్డి, సైదులు తదితరులు ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హర్షం

నడిగూడెం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల శనివారం నడిగూడెంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ సంఘం నాయకులు మొక్క భిక్షపతి, గుండు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

పేద కుటుంబానికి బియ్యం అందజేత

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన పల్లపు యల్లయ్య భార్య నర్సమ్మ (45) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతురాలిది నిరుపేద కుటుంబం. దీంతో శనివారం ఉత్తమ్ పద్మావతి యువసేన ఆధ్వర్యంలో 50 కిలోలు, నడిగూడెంకు చెందిన జయ సీతారామ ఫౌండేషన్ ఫౌండర్ వల్లెపు శ్రీనివాస్ 50 కిలోల బియ్యం యల్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, పల్లపు నాగేశ్వరరావు, దేవరంగుల వీరయ్య, కుడుముల రాంబాబు, గుంజ మురళి, పల్లపు రాము, శ్రీకాంత్, గోపాల్, జయపాల్, కొండల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. రాగిశెట్టి శ్రీను

మునగాల : సామాజిక కార్యకర్త రాగిశెట్టి శ్రీనివాస్ ఆదర్శప్రాయుడని సామాజిక కార్యకర్త మాతంగి అంబేద్కర్ అన్నారు. శనివారం మండలంలోని తాడువాయిలో నిర్వహించిన రాగిశెట్టి శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడువాయిలో పుట్టి పెరిగిన శ్రీనివాస్ తన ఊరితో పాటు మండలవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం ద్వారా సేవ చేసి అన్నాహజారే అనే పేరుపొందాడని తెలిపారు. రాగిశెట్టి శ్రీనివాస్‌ను నేటి సామాజిక కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలని అంబేద్కర్ కోరారు.

రమేష్ మృతి బాధాకరం

మోతె : మండలంలోని సర్వారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రమేష్ దశదిన కర్మను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమేష్ మృతి బాధాకరమని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పల్సూర్ మల్సూర్, నాయకులు చలమర్ల శ్రీధర్, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో ప్రభుత్వ బడి





పచ్చని చెట్లతో నిండి ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- హెచ్ఎం, ఉపాధ్యాయుల కృషితో నందనవనంలా పాఠశాల
- పూలమొక్కలు, నీడనిచ్చే చెట్లతో ఆహ్లాదకర వాతావరణం

మునగాల : మండలంలోని విజయరాఘవపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వివిధ రకాల చెట్లు, పూలమొక్కలతో నందనవనాన్ని తలపిస్తోంది. ఇక్కడ 13 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయడు యాదా శ్రీనివాసరావు గత పదేళ్లుగా చేసిన కృషి ఫలితంగా పాఠశాల ఆవరణ మొక్కలు, చెట్లతో కళకళలాడుతోంది. యాదా శ్రీనివాసరావు తనకు వీలున్నప్పుడల్లా మొక్కలు నాటి, వాటిని బాధ్యతగా సంరక్షించేవాడు. ఆయనకు సహచర ఉపాధ్యాయుల నుంచి సహకారం పూర్తిస్థాయిలో లభించింది. దీంతో పాఠశాలలోకి ప్రవేశించగానే ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలికేలా మారింది. సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉన్న పాఠశాల పదేళ్ల క్రితం ఎడారిగా ఉండేది. నేడు పాఠశాలలో పచ్చదనం ఉట్టిపడుతోంది.

ప్రతిఏడాది విధిగా..

ప్రతి ఏడాది హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే మొక్కలను ఉపాధ్యాయులు తీసుకువచ్చి.. విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణలో నాటడం అలవాటుగా మారింది. పాఠశాల ఆవరణలో హరితహారం కింద నాటిన సుమారు 100 మొక్కలకు పైగా నేడి ఎదిగాయి. పూలమొక్కలే కాకుండా నిమ్మ, దానిమ్మ, బత్తాయి, సీతాఫలం, నీడనిచ్చే చింత, వేప లాంటి చెట్లు కూడా ఈ పాఠశాల ఆవరణలో ఉన్నాయి.

ఉద్యోగుల సహకారం..

మండలంలో అత్యధిక ఉద్యోగులకు నిలయం విజయరాఘవపురం. ఈ గ్రామంలోని పాఠశాలకు పలువురు ఉద్యోగులు తమ వంతు సహకారం అందజేయడంతో పాఠశాల పచ్చదనానికి చిరునామాగా మారింది. ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతిలో 60 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులు సెలవు దినాలలో సైతం పాఠశాలకు వచ్చి మొక్కలకు నీళ్లు పోస్తారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు (ఫైల్)

మా పాఠశాల అంటే నాకెంతో ఇష్టం



మా పాఠశాలకు వస్తే పార్క్‌లో ఉన్న అనుభూతి కలుగుతుంది. పాఠశాలకు రావాలంటే నాకు ఎంతో ఇష్టం. పాఠశాలలో వివిధ రకాల వాసనొచ్చే పూల మొక్కలతో పాటు చెట్ల నీడ ఉండడంతో పాఠశాలలో ఆడుకోవడం అంటే ఎంతో ఇష్టం. పాఠశాల లేని సమయంలో కూడా పాఠశాలలో ఆడుకోవడానికి వస్తుంటాం.

– వస్తం సైదులు, ఐదవ తరగతి విద్యార్థి

ఇంట్లో కంటే పాఠశాలలోనే ఎక్కువగా గడుపుతాం



మా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులం ఇంట్లో కంటే పాఠశాలలోనే ఎక్కువ సమయం గడుపుదాం. పాఠశాల తెరవకముందే వస్తాం. సాయంత్రం కూడా స్కూల్ వదలినప్పటికీ చెట్ల కింద ఆటలాడుకుంటాం. మా పాఠశాల ఆవరణంటే మాకెంతో ఇష్టం. మొక్కలకు నీళ్లు కూడా పోస్తాం.

వస్తం శ్రావణి, ఐదవ తరగతి విద్యార్థి

ఆహ్లాదకర వాతావరణం కల్పించా



విజయరాఘవపురంలో పాఠశాలకు కావాల్సినంత మైదానం ఉంది. గతంలో పాఠశాలలో మొక్కలు లేక ఎడారిలా ఉండేది. మైదానం మొత్తం అపరిశుభ్రంగా ఉండేది. దీంతో పాఠశాల ఆవరణలో పచ్చదనం ఉట్టిపడేలా పలు రకాల మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత చేపట్టా. గత పదేళ్లలో సుమారు 300 మొక్కల వరకు నాటాను.

– యాదా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు

బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు సరికాదు



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఒంటెద్దు నరసింహారెడ్డి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారని, అక్రమ కేసులు పెట్టడం సరికాదని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గోపాలపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీ నాయకులపై కేసులు పెట్టి బెదిరించి పార్టీ మారమనడం ఎక్కడి న్యాయం, ఎక్కడి ప్రజా పాలన అని ప్రశ్నించారు. సర్పంచ్, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసి ఏడాదిన్నర గడుస్తున్నా ఎన్నికలు పెట్టకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆయన తెలిపారు. ఖరీఫ్ సీజన్ పనులు మొదలై నెల రోజులు గడుస్తున్నా మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రైతులకు నీరివ్వకుండా పోలీసులను పెట్టి ఖమ్మం, నూజివీడు ప్రాంతాలకు నీటిని తరలించుకపోవడం దారుణమని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు కె.వెంకట్ రెడ్డి, డాక్టర్ కేఎల్ఎన్ రెడ్డి, జి.కృష్ణ, సీహెచ్.రాజారావు, జి.వీరన్న, శంబిరెడ్డి, నరసింహారావు, శ్రీహరి, హుస్సేన్‌మియా, సుందరయ్య, ధనమూర్తి, సైదేశ్వరరావు, సుధీర్, అంజి, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

గరిడేపల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కాచవారిగూడెంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కడియం వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణ నాయక్, కొప్పుల సైదిరెడ్డి, కేఎల్ఎన్‌రెడ్డి, వీరంరెడ్డి శంభిరెడ్డి, పిడమర్తి అంజి, కడప ఇసాక్, శోభన్, వీరమళ్ల సుందరయ్య, దొంతగాని రాంబాబు, కిరణ్‌కుమార్, సైదులు, సీతారాములు, రమేష్, సందీప్, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



మహిళా అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేస్తున్న శ్రీనివాస్

హుజూర్‌నగర్ : బీసీలకు 56 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, అందులో సగభాగం మహిళలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాస్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని పద్మశాలి భవనంలో శనివారం జరిగిన బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీల నియామక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాగా, బీసీ సంక్షేమ సంఘం మేళ్లచెరువు గ్రామ మహిళా అధ్యక్షురాలిగా ఆలేటి నవ్య, 14వ వార్డు మహిళ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కంచి అమ్మాజీ, లంకెమల్ల సీతమ్మ, హుజూర్‌నగర్ మండలం గోపాలపురం 7వ వార్డు మహిళ అధ్యక్షురాలిగా వెలిశెట్టి కుమారి, పట్టణంలోని 13వ వార్డు అధ్యక్షురాలిగా కంచర్లకుంట్ల లలిత, 14వ వార్డు అధ్యక్షురాలిగా సురభి వాణి, 15వ వార్డు అధ్యక్షురాలిగా ముత్యం నాగమణి, 16వ వార్డు అధ్యక్షురాలిగా చందాల ఉమ, 17వ వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కంబాల సీతమ్మ, తెల్లమల్లె సంధ్య, 19వ వార్డు అధ్యక్షురాలిగా చీక్ల సీతను నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బొడ్డు గోవిందరావు, గూడెపు దీప, రాయల వెంకటేశ్వర్లు, జి.అంజి, నరసింహచారి, వెంకటేశ్వర్లు, అశోక్, మధు, వెంకటేశ్వరరావు, గురుస్వామి, టి.నరేష్, లక్ష్మణ్, కృష్ణ, శ్రీనివాస్, ఇందిరమ్మ, బ్రహ్మచారి, శ్రీనివాస్, శివ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

14న చేయూత పింఛన్‌దారుల సమావేశం



అనంతగిరి : అమీనాబాద్‌లో వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడుతున్న స్నేహలత

మునగాల : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 14న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి చేయూత పింఛన్‌దారుల సమావేశానికి చేయూత పింఛన్‌దారులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరేల్లి బాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఆకుపాములలో నిర్వహించిన చేయూత పింఛన్‌దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బూలక్ష్మి, నాయకులు పోలంపల్లి నాగరాజు, షరీఫ్, ఇందు, సత్యం, మంద ముత్తయ్య, దొంగరి వెంకటేశ్వర్లు, చెవుల శ్రీను, నాగేంద్ర, రాణమ్మ, ఉపేంద్ర, దొంగరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సదస్సును విజయవంతం చేయాలి

అనంతగిరి : జిల్లా కేంద్రంలో ఈ నెల 14న నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి రావి స్నేహలత చౌదరి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఖానాపురం, వెంకట్రాంపురం, అమీనాబాద్ గ్రామాల్లో ఒంటరి మహిళా, చేయూత, వృద్ధాప్య పెన్షన్‌దారులతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో అమీనాబాద్ అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు దేవపంగు రవి, పాపారావు, ఉపేంద్రమ్మ, మేరమ్మ, సత్యవతి, మహాలక్ష్మమ్మ, సోమమ్మ పాల్గొన్నారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జి.కాసీం కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు సతీష్, రాజేష్, శ్రీనివాస రావు, పుల్లయ్య, రాణి, ఇసాక్, వెంకటేశ్వర్లు, నాగచారి, తారాబాయి, కంకణాల వీరలక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

దొడ్డా నారాయణరావు మృతి తీరని లోటు



నారాయణరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు, పేదలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చిలుకూరులో నారాయణరావు భౌతికకాయాన్ని సీపీఐ మండల నాయకులతో కలిసి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, కార్యవర్గ సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, ఎడ్ల అంజిరెడ్డి, ప్రతాని సైదులు, తిరగమల్ల కిరణ్, కట్ట అశోక్, పగడాల శ్రీను, కుందూరు వెంకట్‌రెడ్డి, పోకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో గురుపూజోత్సవం



వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నేరేడుచర్ల : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పల్లెపంగు వీరబాబు, కాలం నాగయ్య, శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జూలూరి అశోక్, గంధం శావయ్య, రామ్మూర్తి, మండల కార్యదర్శి విమల, నాయకులు వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, హిందూజ, జగతయ్య, కిరణ్, వినయ్, కృష్ణవేణి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ కమిటీలను ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా పిడమర్తి రవి, ఉపాధ్యక్షులుగా బండారు నాగుల్‌మీరా, ఇంద్రపల్లి రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గుండెపంగు నరేష్, ఎమ్మెస్పీ అధ్యక్షుడిగా బండారు రమేష్, ఉపాధ్యక్షుడిగా పిడమర్తి గురుస్వామి, ప్రధాన కార్యదర్శిగా పిడమర్తి మహేష్, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా బండారు వేణు, ఉపాధ్యక్షుడిగా నకిరేకంటి రవి, ప్రధాన కార్యదర్శిగా పిడమర్తి మహేష్, కన్వీనర్ కడప అనిల్‌లతో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, కుర్రి వెంకన్న, దురే వినోద్, రాంబాబు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం



ఐఐటీ, ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీలో సీటు సాధించిన నేరేడుచర్లకు చెందిన విద్యార్థులను, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని శనివారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఖరగ్‌పూర్‌లో సీఎస్ఈ సీటు సాధించిన బట్టు ఆశ్రితవల్లి, ఐఐటీ మద్రాస్‌లో మెకానిక్ ఇంజనీరింగ్ సీటు సాధించిన రమావత్ సుకుమార్, ట్రిపుల్ ఐటీ బాసర సీటు సాధించిన పెంచికల్‌దిన్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సద్దల గీతికను సత్కరించారు. ఈ సందర్భంగా గీతికకు రూ.8 వేల ఆర్థికసాయం అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు గుండ్రెడ్డి సైదిరెడ్డి, క్లబ్ జిల్లా చైర్మన్ బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, పెంచికల్‌దిన్నె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్‌రావు, కార్యదర్శి యూసుఫ్, నాగేశ్వర్‌రావు, పోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, కందిబండ శ్రీనివాస్‌రావు, గుండా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తూకంలో తేడాలొస్తే చర్యలు తప్పవు



రేషన్ దుకాణాల కాంటాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు

మేళ్లచెరువు : తూకంలో తేడాలు వస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలోరేషన్ దుకాణాల కాంటాలను పరిశీలించి వాటికి ఆ శాఖ సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తూకంలో తేడా లేకుండా వినియోగదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంపత్, రేషన్ డీలర్లు పెండ్లి లచ్చయ్య, శివారెడ్డి, వెంకటరెడ్డి, కోటయ్య, సరస్వతి, బాలస్వామి, సామ్య, బోయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



గరిడేపల్లి : లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మార్కెట్ డైరెక్టర్ నట్టె జానకయ్య



పాలకవీడు : సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మోతీలాల్

గరిడేపల్లి : పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నట్టె జానకయ్య అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మండలంలోని కల్మలచెరువులో పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి, మీసాల యోహాన్, విజయ, ఆరె కృష్ణారెడ్డి, గుండ్ల సత్యనారాయణరెడ్డి, బచ్చలకూరి కృష్ణప్రసాద్, గుండ్ల అనిల్, ప్రేమ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పాలకవీడు : మండలంలోని బెట్టెతండా గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాళోతు మోతీలాల్ అందజేశారు. నాయకులు బండావత్ శివాజీ, బండావత్ నగేష్, బండావత్ శ్రీను, బాలాజీ, నాగయ్య, కిషన్, రమణ, విక్రమ్, వినోద్, మధు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

- పదహారు మందిపై కేసు నమోదు

గరిడేపల్లి : పేకాట స్థావరాలపై గరిడేపల్లి పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అప్పన్నపేట గ్రామ శివారులో ఏనె మీద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు చేయగా ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డట్లు తెలిపారు. వారి నుంచి రూ. 2260 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని సర్వారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ.6300 నగదు, 9 సెల్‌ఫోన్‌లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎట్టకేలకు భవన నిర్మాణానికి మోక్షం

- మున్సిపల్ భవనం నిరాణానికి నేల పరీక్ష పూర్తి
- త్వరలో పాత భవనాన్ని కూల్చనున్న అధికారులు
- నయానగర్‌కు తరలనున్న కార్యాలయం
- ఎటూ తేలని డబ్బాకొట్ల పంచాయితీ



నయానగర్‌లో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్న భవనం

కోదాడ : కోదాడ మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇప్పటికే మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నేల పరీక్ష పూర్తి చేశారు. ఇక మున్సిపల్ కార్యాలయాన్ని నయానగర్‌లోని జ్యోతి అపార్ట్‌మెంట్ వద్ద గల పాత కిడ్స్ పబ్లిక్ స్కూల్ భవనంలోకి తరలించనున్నారు. ఈమేరకు ఆ భవనంలో మార్పులు చేర్పులు చేస్తున్నారు. కార్యాలయాన్ని తరలించాక పాత భవనాన్ని కూల్చి భవననిర్మాణ పనులు ప్రారంభిస్తారు. అయితే శిథిలావస్థకు చేరిన భవనంతో ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి జనవరి 25న శంకుస్థాపన చేశారు. వివిధ కారణాల వల్ల పనుల ప్రారంభం ఆలస్యమైంది.

రూ.6 కోట్లతో నిర్మాణం..

కోదాడ మున్సిపల్ కార్యాలయాన్ని అధునిక పద్ధతిలో రూ.6 కోట్లతో నిర్మించనున్నారు. మున్సిపాలిటీకి చెందిన పాత ఎస్‌బీఐ భవనం నుంచి ఫేజ్ ఆఫ్ కాల్ కార్యాలయం ఉన్న ప్రదేశం వరకు భవనం నిర్మాణం చేపట్టనున్నారు. మున్సిపల్ భవన నిర్మాణ ప్లాన్‌ను కోదాడ ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో తయారు చేయించినట్లు సమాచారం. బహుళ అంతస్తుల్లో నిర్మించే ఈ భవనానికి ముందు వైపు, వెనుకవైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిసింది. నూతన భవన నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఉన్న డబ్బాకొట్లు అడ్డంకిగా మారాయి. వీటిని తొలగించకుండా నూతన భవన నిర్మాణం చేయడం సాధ్యం కాదని అధికారులు అంటున్నారు

తేలని డబ్బాకొట్ల పంచాయితీ..

కోదాడ మున్సిపాలిటీ కార్యాలయం ఉన్న ప్రదేశం పట్టణ నడిబొడ్డున ఉంది. దీనికి నాలుగు వైపుల రహదారులు ఉన్నాయి. కాగా ఈ భవనానికి నాలుగు వైపులా మున్సిపల్ కార్యాలయం స్థలాన్ని ఆక్రమించి కొందరు డబ్బాకొట్లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాటు మున్సిపాలిటీ కార్యాలయానికి తూర్పు వైపు ఉన్న మండపం స్థలంలో కూడా డబ్బాకొట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థలం విషయంలో గతంలో కోదాడ గ్రామపంచాయతీ, వక్ఫ్‌బోర్డు వారి మధ్య వివాదం జరిగింది. ఇటీవల కోదాడ మున్సిపాలిటీ అధికారులు ఈ డబ్బాకొట్లను తొలగించాలని నోటీసులు ఇవ్వడంతో వారంతా ఆందోళనకు దిగారు. డబ్బాకొట్లను తొలగిస్తే అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ కట్టి తమకే అద్దెకు ఇస్తామంటే ఖాళీ చేస్తామని వారు చెపుతున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నందున చుట్టూ షాపింగ్ కాంప్లెక్ నిర్మించి మధ్యలో మున్సిపాలిటీ భవనాన్ని నిర్మిస్తే మున్సిపాలిటీకి ఆదాయం రావడంతో పాటు పట్టణం సుందరంగా తయారవుతుందని పలువురు అంటున్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మాజీ ప్రజాప్రతినిధులే రెచ్చగొడుతున్నారా..?

కోదాడ మున్సిపాలిటీ చుట్టూ ఉన్న డబ్బాకొట్లను తొలగించకుండా కొత్త భవనం ఎలా నిర్మించాలో చేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకున్నారు. గతంలో పంచాయతీ, మున్సిపాలటీల్లో ప్రజాప్రతినిధులుగా పని చేసిన వారు తమ పలుకుబడితో ఈ డబ్బా కొట్లను ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారని, ఇప్పుడు వాటిని తొలగించడానికి అధికారులు ప్రయత్నిస్తుండగా సదరు ప్రజాప్రతినిధులు దుకాణాలను అద్దెకు తీసుకున్న వారిని ముందు పెట్టి ఆందోళనలు చేయిస్తున్నారనే విమర్శలున్నాయి.